క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి తీర్థ మహోత్సవం



మార్టేరులో అయ్యప్ప స్వామి ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో ఉన్న అయ్యప్ప స్వామి వారి 19వ తీర్థ మహోత్సవం బుధవారం ముగిసింది. ఈ నెల 13న అయ్యప్ప స్వామికి అభిషేకాలతో ప్రారంభించి మూడు రోజుల పాటు గోపూజ, శాస్త్ర పుష్పార్చన, పడిపూజ, ఆభరణాల ఊరేగింపు, బుధవారం జ్యోతి దర్శనం, అన్నసమారాధన, కార్యక్రమాలతో నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ఆగర్రులో గోకుల షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చందపర్రు, ఆగర్రులో రూ.7 5లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆగర్రులో 90 శాతం సబ్సిడీతో నిర్మించిన గోకుల షెడ్డును మంత్రి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, సర్పంచ్‌లు కొయ్యే అచ్చియ్య, సాకా గంగారత్నం, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎస్‌ఎస్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



అగ్నిప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న పమ్మి లాజరు

యలమంచిలి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు చెప్పారు. వడ్డిలంక గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాదంలో గృహోపకరణాలన్నీ దగ్ధం కావడంతో ఆ రెండు కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగాపే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పమ్మి లాజరు అగ్నిప్రమాద బాధితులకు రెండేసి జతల చొప్పున రగ్గులు, దుప్పట్లు, దుస్తులు 26 కిలోల బియ్యం ముత్యాలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు ప్రమాద బాధితులతోపాటు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘ నాయకుడు మామిడిశెట్టి చిట్టిబాబు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణోత్సవాలు



దగ్గులూరులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు తూర్పువీధిలో ఉన్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. మత్స్యపురి గ్రామానికి చెందిన హరేశ్రీనివాస గ్రూపు చిన్నారులు కోలాటం నిర్వహించారు. గ్రామ పెద్దలు రథాన్ని లాగి లాంఛనంగా ప్రారంభించారు.

పండుగ పేరు.. పందేల జోరు

- నరసాపురం ప్రాంతంలో అడుగడుగునా పందేల బరులు
- కూటమి నేతల బరి తెగింపు
- మూడురోజుల్లో చేతులు మారిన రూ.30 కోట్లు
- ప్రేక్షక పాత్ర కూడా పోషించని పోలీసులు

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా అంటే సంక్రాంతికి కోడిపందేలకు ప్రసిద్ధి అనే విషయం అందరికీ తెలిసిందే కోడిపందేల మాటున పేకాట, గుండాట వంటి జూదాలు కూడా షరా మామూలే. అయితే పూర్వం నుంచి పండుగ రోజుల్లో కోడిపందేలు, జూదాలు వంటివి నరసాపురం ప్రాంతంలో మాత్రం నామమాత్రంగా ఉండేవి. ఈ ప్రాంతాలవారు వేరే చోట్లకు వెళ్లే వారు కానీ ఇక్కడి గతంలో పాలించిన ఎమ్మెల్యేలు కూడా స్థానికంగా జూదాలను పెద్దగా ప్రోత్సహించలేదు. అయితే ఈ ఏడాది సీన్ మొత్తం రివర్స్ అయ్యింది. కనీవినీ ఎరుగని రీతిలో పండుగు మూడు రోజులు మొత్తం నరసాపురం ప్రాంతం పేకాట, గుండాటల మయంగా మారిపోయింది. కోడిపందేలు మాటుల విచ్చలవిడిగా సాగాయి. పండుగ మొదటిరోజు సోమవారం నాడే విచ్చల విడిగా పందేలు సాగగా, ఇక సంక్రాంతి మంగళవారం, మూడవరోజు బుధవారం అయితే పది రెట్లు ఎక్కువగా పందేలు సాగాయి. గతంలో నరసాపురం మొత్తంగా చూసుకుంటే ఓ 10 బరులు ఉండేవి. ఇప్పుడు నరసాపురం పట్టణంలో 7 చోట్ల, రూరల్ మండలంలో 17 చోట్ల, మొగల్తూరు మండలంలో ఏకంగా 19 చోట్ల బరులు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రతి 5 పంచాయతీలకు ఓ బరి, పట్టణంలో ప్రతి 5 వార్డులకు ఓ బరి ఉండేలా ఏర్పాటు చేశారు. పందేల బరుల వద్ద మైనర్లు ఎక్కువగా కనిపించడం కొసమెరుపు. ఈ మూడు రోజులు నరసాపురం నియోజకవర్గంలో మొత్తం రూ.30 కోట్లు వరకూ చేతులు మారినట్టు అంచనా. అయితే గల్లీగల్లీలో జూదాలు ఏర్పాటు చేసి ఈ విష సంస్కృతిని నరసాపురం ప్రాంతానికి కూటమి నాయకులు విస్తరింపచేశారనే విమర్శలు వస్తున్నాయి.

టూవీలర్స్‌కు చలాన్లకే పోలీసులు పరిమితం

నరసాపురం డివిజన్ కేంద్రం. డీఎస్పీ, ఆర్డీఓలు ఇక్కడే ఉంటారు. ఊరంతా జూదాలతో మమారు మోగుతుంటే ఏ బరి వద్దా కూడా పోలీసు అనేవారు కనిపించనేలేదు. గతంలో బరుల వద్ద మఫ్టీలోనైనా కానిస్టేబుళ్లను పెట్టి, అల్లర్లు జరిగితే అలెర్ట్ అవ్వొచ్చనే అనే విధంగా ప్రేక్షక పాత్ర తరహాలో పోలీసు శాఖ తీరు ఉండేది. కనీసం ఈ ఏడాది అదీ లేదు. కొందరు కానిస్టేబుళ్లు బరుల వద్దకు రహస్యంగా తిరిగారు. బరులు ఎక్కడెక్కడ వేశారు? వ్యాపారం ఎలా సాగుతుంది? అనే అంశాలు ఆరా తీయడానికి, బరులు ఏర్పాటు చేసిన కూటమి నేతలు మాట్లాడుకున్న మామూళ్లు వసూలు చేసుకోవడానికే పోలీసులు ప్రాధాన్యత ఇచ్చినట్టు విమర్శలు వస్తున్నాయి. హైకోర్టు ఆదేశాలు ఉన్నా...జూదాలు అరికట్టడం మా పని కాదన్నట్టు, ఈ మూడురోజులు పోలీసులు ప్రధాన సెంటర్లలో మకాం వేసి టూవీలర్స్‌కు చలానాలు రాశారు. పండుగ వేళల్లో ఫ్యామిలీతో బైక్‌పై బయటకు వచ్చిన వారు పోలీసుల ఫైన్‌లకు భయపడి హడలిపోయే పరిస్థితి కనిపించింది.

మొత్తం కూటమి నేతల కనుసన్నల్లోనే...

నియోజకవర్గంలో కోడిపందేలు, జూదాలు మొత్తం కూటమి నేతల కనుసన్నల్లో జరిగాయి. మున్సిపాలిటీలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక, అలాగే వీవర్స్ కాలనీ శివారులో పెద్ద బరులు ఏర్పాటు చేశారు. వీవర్స్ కాలనీ వద్ద నరసాపురం వస్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మీటింగ్ పెట్టే గ్రౌండ్‌నే అదే పార్టీకి చెందిన ఓ బెట్టింగ్ నాయకుడు భారీ సెట్టింగ్స్‌తో బరి ఏర్పాటు చేశాడు. 30 గుండాట బోర్డులు ఏర్పాటు రాత్రి పగలు తేడా లేకుండా ఆడారు. నరసాపురం మండలం రుస్తుంబాధ, వేములదీవి, లక్ష్మణేశ్వరం, పసలదీవి, మల్లవరం, నవరసపురం, చిట్టవరం, కొప్పర్రు, తూర్పుతాళ్లు, మొగల్తూరు మండలం మొగల్తూరు, పేరుపాలెం, శేరేపాలెం, కొత్తోట, రామన్నపాలెం ప్రాంతాల్లో కూటమి నేతలు జూదాలు నిర్వహించారు.

'ప్రత్యేక' ఏర్పాట్లతో పందేలు

పాలకొల్లు అర్బన్: సంప్రదాయం ముసుగులో జూద క్రీడలు విచ్చలవిడిగా సాగాయి. కోడిపందేలు, గుండాట, పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగాయి. మండలంలోని తిల్లపూడి, శివదేవుని చిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు, చింతపర్రు, వాలమర్రు గ్రామాల్లో సాదాసీదాగా కోడిపందేలు, గుండాటలు నిర్వహించారు. వడ్లవానిపాలెం, పూలపల్లిలో బరిలో లక్షల్లో పందేలు సాగాయి. పూలపల్లిలో కోడిపందేలు తిలకించడానికి డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే అతిథులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అతిథుల కోసం ఆత్రేయపురం పూతరేకులు ఏర్పాటు చేశారు. గుండాట బోర్డు ముందు ధైర్యంగా నిలుచుని యువత పందేలు కాయడం విశేషం. వడ్లవానిపాలెంలో హైదరాబాద్‌కి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, గోల్డ్‌మేన్‌గా పిలిచే అశోక్ గౌడ్ కోడి పందేలు తిలకించడానికి పరివారంతో విచ్చేశారు. మెడలోను, చేతికి బంగారు గొలుసులు వేసుకోవడంతో అతనితో సెల్ఫీలు దిగారు.



పెనుగొండ: కొతాలపర్రులో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: గుండాట నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: కలగంపూడిలో తలపడుతున్న కోళ్లు



నరసాపురం: వీవర్స్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన బరిలో సందడి

పది గ్రామాల్లో పందేలు

యలమంచిలి: యలమంచిలి మండలంలో పది గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయం పేరిట జోరుగా సాగే ఈ జూద క్రీడకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. ముఖ్యంగా ఈసారి పురుషులుతోపాటు మహిళలు కూడా కోడి పందేలు, గుండాట ఆడడానికి ఆసక్తి కనపరిచారు. యలమంచిలిలో ఒక బరిలో కోడి పందేలతోపాటు చిన్న పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దీంతో ఆ ప్రదేశం జనంతో కిటకిటలాడింది. కోడి పందేలతోపాటు గుండాట, కోతాట, పేకాటలు జోరుగా సాగాయి. కోడి పందేల్లో ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయిలు చేతులు మారాయి. కలగంపూడి, యలమంచిలి గ్రామాల్లో రూ.లక్షల్లో పందేలు జరుగగా, గుంపర్రు, కాజ, కొంతేరు, వడ్డిలంక, మేడపాడు, కట్టుపాలెం, బూరుగుపల్లి, పెదలంక, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాల్లో చిన్న స్థాయిలో పందేలు జరిగాయి.

యథేచ్ఛగా కోడి పందేలు

పెనుగొండ: సంక్రాంతి సాంప్రదాయ ముసుగులో జూదాలు యథేచ్ఛగా సాగాయి. ఆచంట నియోజక వర్గంలో పెనుగొండ, వడలి, దొంగరావిపాలెం, రామన్నపాలెం, ములపర్రు, చినమల్లం, ఆచంట, వల్లూరు తోట, కొడమంచిలి, పెనుమంట్ర మండలం, పోడూరు మండలాల్లోనూ కోడి పందేలు జోరుగా కొనసాగాయి. పేరుకే కోడి పందేల శిబిరాలే అయినా, గుండాట, పేకాటలు ఇష్టారాజ్యంగా నిర్వహించారు. ప్రభుత్వ పెద్దల ఆశీస్సులే ఉండడంతో పోలీసులు, అధికారులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మూడు రోజుల పరోక్ష అనుమతులు ముగిసినా పెనుమంట్ర మండలంలో పోటీలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి.



యలమంచిలి: గుండాట ఆడుతున్న మహిళలు



నరసాపురం: విచ్చలవిడిగా గుండాట నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: పూలపల్లి బరిలో డిజిటల్ స్క్రీన్‌లో కోడిపందేలు తిలకిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: చిట్టవరంలో గుండాట వద్ద చిన్నారులు, మహిళలు



పాలకొల్లు అర్బన్: వడ్లవానిపాలెంలో గుండాట వద్ద మహిళల సందడి



మొగల్తూరు: బరిలో తలపడుతున్న కోళ్లు

గ్రామాల్లో అమ్మవార్ల జాతర్ల సందడి



నరసాపురం: నాగారమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

యలమంచిలి: సంక్రాంతి ఉత్సవాలలో యలమంచిలి గ్రామ దేవతలు మూలస్థానేశ్వరీదేవి, పుంతల ముసలమ్మ మట్లపాలెం గ్రామ దేవతలు పుట్లమ్మ, కనకదుర్గమ్మ నారినమెరక గ్రామ దేవతలు పుట్లమ్మ, మారమ్మ వడ్డిలంక గ్రామ దేవత కోట్లమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. యలమంచిలిలో భారీ సెట్టింగులు, పిల్లలకు, మహిళలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మాంసాహార భోజనం, మూలస్థానేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న వారికి గిఫ్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తున్న వారికి సున్నుండలు, అరిసెలు, పూతరేకులు వంటి స్వీట్స్ ఉచితంగా ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా ఉత్సవాలకు వచ్చారు. దీంతో మూడు రోజులుగా యలమంచిలి ప్రధాన రహదారి తహసీల్దార్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు కిలోమీటరు మేర పూర్తి ట్రాఫిక్‌తో నిండిపోయింది.

ఘనంగా నాగారమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. శనివారం రాత్రి అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటి తెలిపింది.

వైభవంగా పోలేరమ్మ జాతర

పెనుమంట్ర: మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో ఉన్న శ్రీపోలేరమ్మ అమ్మవారి 111వ జాతర మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈనెల 13న ప్రారంభమైన జాతర మహోత్సవం బుధవారం ఉదయం అమ్మవారికి పరగంగ నైవేద్యం చెల్లించి ఆసాదుల గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పూరింటి ఆవరణలో నిప్పులగుండం వెలిగించారు. అనంతరం శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన, రాత్రి ఆచంట వారి నాదస్వర బృందం, పూలపల్లి వారితో గరగనృత్య ప్రదర్శనలతో అమ్మవారిని అత్తింటికి తీసుకెళ్లారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో గరగాలమ్మ జాతర మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం రాత్రి శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) పాల్గొన్నారు.



యలమంచిలి: పుంతలో ముసలమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా ప్రభల ఉత్సవం



వడలిలో ప్రభల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: కనుమ పండుగ సందర్భంగా ప్రభల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం వడలిలో వీరభద్రుని ప్రతిరూపంగా ప్రభతో గ్రామోత్సవం నిర్వహించారు, జొన్నల ప్రసాదం పంపిణీ చేశారు. పశువుల వృద్ధి చెందానల పంటలు పండాలని అగస్త్యేశ్వర స్వామి కొలువై ఉన్న ప్రభల ఉత్సవం గ్రామం శివారున పంట పొలాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జొన్నల ప్రసాదాన్ని సంతాప ప్రాప్తి కోసం, వివాహ యోగ్యం కోసం పోటీ పడి తీసుకొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

చెరుకూరి సేవలు ఎనలేనివి

నరసాపురం: పట్టణానికి చెరుకూరి లక్ష్మణరావు చేసిన సేవలు ఎనలేనివని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కడప ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. నరసాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ చెరుకూరి లక్ష్మణరావు పేరుమీద ఆయన కుమారుడు రంగనాథ్ నడుపుతున్న చెరుకూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న 150 మంది పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీలు మాట్లాడుతూ లక్ష్మణరావు చైర్మన్‌గా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, కోటిపల్లి సురేష్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

పాలకొల్లు అర్బన్: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్ఎన్‌వీఎస్ గంగాధర శర్మ ప్రశంసించారు. మండలంలోని లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1981-82 పదోత రగతి విద్యార్థులు రూ.4 లక్షల వితరణతో భోజన బల్లలు, మధ్యాహ్న భోజన గది ఆధునికీకరణ పనులను వీరాస్వామి, శర్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ డీవీ త్రినాథరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, ద్రోణంరాజు బలరామప్రసాద్, కెల్లా సింహాచలం, యల్లపు వెంకటరమణ పాల్గొన్నారు.



1981-82 బ్యాచ్ విద్యార్థులు

కొబ్బరి చెట్టు కూలి దెబ్బతిన్న భవనం

పెనుగొండ: సిద్ధాంతం ఘటాల దిబ్బలో కొబ్బరి చెట్టు కూలి భవనం పాక్షికంగా దెబ్బతింది. మంగళవారం సాయంత్రం కొబ్బరి చెట్టు ఒక్కసారిగా కూలి బైలపాటి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటిపై కూలిపోయింది. దీంతో శ్లాబు కొంత మేర దెబ్బ తినడంతో భవన యజమానులు భయాందోళనలకు గురయ్యారు. చెట్టు కూలిన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడతో ప్రమాదం తప్పింది.

